పుష్ప సోయగం..
భక్తజన పారవశ్యం

- బోయకొండ ఆలయంలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ
- రూ.3 లక్షల విలువచేసే పూలతో సరికొత్త శోభ
- ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించిన భక్తులు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం సరికొత్త శోభతో భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. చూడగానే కట్టిపడేలా పుష్పాలంకరణతో సరికొత్త శోభ సంతరించుకుంది. ఆదివారం బెంగళూరుకు చెందిన కృష్ణప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.3లక్షల విలువ చేసే పలు రకాల పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. దీంతో ఆలయం అంతా పుష్ప పరిమళ భరిత పుష్పాల కొత్తదనం.. అందాలు భక్తులను కట్టిపడేశాయి. ఆషాఢ మాసంలో కర్ణాటక భక్తులు అమ్మవారి దర్శనం కోసం విరివిగా రావడం పరిపాటి. బెంగళూరు నుంచి పూలను తీసుకొచ్చి శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జామున వరకు ఆలయం లోపల, ఆలయం ముందు భాగం, చుట్టూ పరిసరాల్లో పూలతో అలంకరించారు. అనంతరం కుటుంబ సమేతంగా పూజలు చేయించారు. కోరిన కోర్కెలు ఫలించడంతో పుష్పాలంకరణ చేసి మొక్కుబడి చెల్లించినట్లు కృష్ణప్ప తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు ఈఓ ఏకాంబరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.


ప్రత్యేక పూలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం


ప్రత్యేక పూల అలంకరణలో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఆలయం

క్లుప్తంగా

మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న రాజకీయ పార్టీలు


నిరసన వ్యక్తం చేస్తున్న విలేకరులు

పలమనేరు: మీడియా స్వేచ్ఛకు రాజకీయపార్టీలు భంగం కలిగించడం రాజకీయ పార్టీలకు తగదని పలమనేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఒక టీవీ చానల్ కార్యాలయంపై టీఆర్‌ఎస్ దాడులకు నిరసనగా పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద విలేకరులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో విలేకరులపై దాడులు, కేసులు బనాయించడం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి అడ్డుకట్ట వేసే దిశగా ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్, రమేష్, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక


కంటి రోగులను పరిశీలిస్తున్న వైద్యులు

కుప్పం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 120 మంది కంటి రోగులను పరీక్షించి 30మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు శిబిరం నిర్వాహకులు, సాయిమాత సేవాట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. బెంగళూరులోని శారద కంటి ఆస్పత్రి ఉచిత ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కంటి వైద్యులు బాబు, వంశీ తదితరులు రోగులను పరీక్షించారు.

హామీలతో ప్రజలకు కూటమి కుచ్చుటోపీ


అన్నదానం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

గంగవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలకు కుచ్చుటోపీ పెట్టిందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి విమర్శించారు. తన పుట్టిన రోజు పురస్కరించుకుని భాస్కర్‌రెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఆయన్ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పార్టీ మాజీ కన్వీనర్ మోహన్ రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతి రెడ్డి, అందురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్త తొలగింపు ప్రాజెక్టు ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గొబ్బిళ్లకోటూరు డంపింగ్ యార్డు వద్ద చెత్త తొలగింపు ప్రాజెక్టును ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ, లెగసీ వేస్ట్ ల్యాండ్ రీక్‌లెమైషన్‌త్రో బయోరెమిడేషన్ అండ్ బయోమైనింగ్ ప్లాంట్‌ను రూ.1.12 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పట్టణంలోని నిత్యం సేకరించే తడి, పొడి చెత్తలను వేరు చేసి లెగసీ వేస్ట్‌ను ఎప్పటికప్పుడు దీనిని ద్వారా శుభ్రం చేసే అవకాశం కలిగిందన్నారు. పట్టణాన్ని చెత్తరహిత పట్టణంగా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని స్థానిక ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఈఓ పుష్పగిరినాయక్, ఏఈ స్నేహప్రియ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా రఘునాథరెడ్డి



రొంపిచెర్ల: రొంపిచెర్ల సింగిల్‌విండో అధ్యక్షుడిగా బందార్ల రఘునాథరెడ్డిని నియమిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీ బందార్లపల్లెకు చెందిన రఘునాథరెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. రొంపిచెర్ల సింగిల్‌విండో చైర్మన్‌గా పని చేస్తున్న దేవులపల్లె హరినాధ రెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎన్నికలు జరిగే వరకు సింగిల్‌విండో అధ్యక్షుడిగా రఘునాథ రెడ్డి కొనసాగనున్నారు.

సత్యసాయి శతజయంతి వేడుకలకు జయప్రదం చేద్దాం


సమావేశంలో చర్చిస్తున్న సత్యసాయి భక్తులు

వి.కోట : పుట్టపర్తిలో ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించనున్న సత్యసాయి శతజయంతి వేడుకలను మండల సత్యసాయి బాబా భక్తులు జయప్రదం చేయాలని మండల శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని సత్యసాయినగర్‌లో ఆదివారం సాయిబాబా జిల్లా సమన్వయకర్తలు, కన్వీనర్లు, భజన మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. శతజయంతి వేడుకల విధి విధానాలపై చర్చించారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా జిల్లా సమన్వయకర్తలు, బాల వికాస్ గురువులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

జన 'శోభాయాత్ర'


పుంగనూరు గోకుల్ సర్కిల్‌లో శోభా యాత్ర

పుంగనూరు (చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన శోభా యాత్రకు భారీగా తరలివచ్చారు. 13 ఏళ్లగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి తెలిపారు. ఛత్రపతి శివాజీ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. భారత్ మాతాకి జై అంటూ యువత నినాదాలు చేసింది. యాత్ర నగరి ప్యాలెస్ నుంచి మేళ తాళాల నడుమ అట్టహాసంగా గోకుల్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం సభ్యులతో సమావేశం నిర్వహించారు.

ఆకట్టుకున్న 'దుర్యోధన వధ'

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలంలోని పోటుకనుమలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో ఆదివారం ప్రదర్శించిన దుర్యోధన వధ ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా మహాభారతంలో కీలకమైన దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శన భక్తులను అలరించింది. ముందుగా మడుగులో దాగి ఉన్న దుర్యోధనుడిని భీముడు రెచ్చగొట్టే మాటలతో, కవ్వింపు చర్యలతో వెలికి తీసుకువచ్చి హతమార్చడం భారతగాథ తెలిసిందే. భీమ, దుర్యోధనుల వేషధారులు యుద్ధ సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం దుర్యోధన ప్రతిమ తొడపై భీముడు గదతో మోదడంతో దుర్యోధన పాత్రధారి విరుచుకుపడిపోవడంతో వధ ఘట్టం ముగిసింది. దుర్యోధనుడిగా కిరణ్, భీముడిగా తారక్ అద్భుతంగా నటించారు. రాత్రి జరిగిన అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ధర్మకర్త మండలి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తవణంపల్లె: మండలంలో టి.పుత్తూరులోని శ్రీ కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 5 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 5న మహాద్వార పూజ, అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజూ ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, ఉయ్యాలసేవ నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా హంసవాహనం, సింహ వాహనం, హనుమంతు వాహనం, శేష వాహనం, కల్యాణోత్సవం, గరుడసేవ, రథోత్సవం, అశ్వ వాహనం, చక్రస్నానం, సూర్యప్రభ, చంద్ర ప్రభ, పుష్పపల్లకి సేవ, కల్పవృక్ష వాహనం, తెప్పోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయలని కోరారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వాహకులు శంకర్ రెడ్డి, పాలాక్షిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధేశ్వర రెడ్డి, శంకర్ రెడ్డి, పాలాక్షిరెడ్డి

తాగునీళ్లకే దిక్కు లేదు..
ఎయిర్‌పోర్టు అవసరమా?

- 18వేల ఎకరాలు బలవంతంగా లాక్కోవడం ఎవరికోసం..?
- కుప్పం విద్యాభివృద్ధికి దివంగత సీఎం వైఎస్ కృషి
- బాబు హయాంలో అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కుప్పం: కుప్పం నియోజకరవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు పీడిస్తున్నాయి..నీళ్లకు దిక్కులేదు..దీనిని పట్టించుకోకుండా ఎయిర్‌పోర్టు పేరిట సీఎం చంద్రబాబునాయుడు ఆర్భాటం చేస్తున్నారని, ఇది అవసరమా?అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల గోపి విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తాగునీళ్లు ఇవ్వండి బాబూ..అని ప్రజలు మొత్తుకుంటూ ఉంటే ఎగరడానికి విమానాలిస్తామని సీఎం అంటున్నారని, పైగా విమానాశ్రయం కోసం 18 వేల ఎకరాలు ఎందుకో అధికార పార్టీ చెప్పాలని డిమాండు చేశారు. హైదరాబాద్‌లో 9 వేల ఎకరాలు, విజయవాడలో 12 వేల ఎకరాలు విమానాశ్రయానికి ఉండగా, కుప్పంలో మాత్రం ఇన్ని వేల ఎకరాలు లాక్కోవడం ఎవరి కోసమని ప్రశ్నించారు. ఏడాది మూడు పంటలు, వినూత్నంగా పూలు, కూరగాయలు, పండ్లు సాగు చేసే పచ్చని భూములను విమానాశ్రయం కోసం బలవంతంగా లాక్కోవడం ప్రభుత్వానికి ఎంతమాత్రమూ తగదని నిరసించారు. కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కస్తూర్బా, మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేసి కుప్పం విద్యాభివృద్ధికి కృషి చేశారని, చంద్రబాబు హయాంలో మాత్రం ప్రైవేటు విద్యాసంస్థల ఏర్పాటుకే పెద్దపీట వేశారని దుయ్యబట్టారు. కుప్పానికి చంద్రబాబు చేసింది శూన్యమని, ప్రజలను ప్రలోభాలతో మభ్యపెట్టే ప్రయత్నం చేయడం తప్పితే అభివృద్ధి అంటూ చేసిందేమీ లేదని పెదవి విరిచారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మునుస్వామి, కల్లగంపల్లి కృష్ణప్ప, నంజప్ప, సుబ్రమణ్యం, నిజాముద్దీన్, ఇర్ఫాన్ బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సామాజిక సేవలు


మాట్లాడుతున్న చైర్మన్ నందీశ్వరయ్య

పుంగనూరు(చౌడేపల్లె): కులమతాలకు అతీతంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలందిస్తోందని ఆ సంస్థ చైర్మన్ నందీశ్వయ్య అన్నారు. ఆదివారం పుంగనూరులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేయవలసిన సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ, ఇదివరకే పట్టణ ప్రజల సౌకర్యార్థం ఐదు ఫ్రీజర్ బాక్సులు సంస్థ అందుబాటులో ఉంచిందన్నారు. మరో రెండు బాక్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. జూలై 20న రామసముద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్టేజి నిర్మాణానికి దాతలు చేయూతనివ్వాలని కోరారు. సమావేశంలో ఏసీ నారాయణ రెడ్డి, నాన బాల గణేష్, త్యాగరాజు, రాజశేఖర్, భక్తవత్సలరాజు, జగన్మోహన్‌రెడ్డి, చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, వనిత, హరినాథ్‌రెడ్డి, వెంకటముని, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, ద్వారకమ్మ పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజంలో మార్పు


మాట్లాడుతున్న వీక్షణ సంపాదకులు వేణుగోపాల్


బాలాజీ రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు

–నేటి తరం సాహిత్యాన్ని అందిపుచ్చుకోవాలి

పలమనేరు: సమాజంలో మార్పు సాహిత్యంతో సాధ్యమవుతుందని వీక్షణ సంపాదకులు ఎస్ వేణు గోపాల్ అన్నారు. పలమనేరులోని లయన్స్ సేవా కేంద్రంలో పలమనేరు రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం సాహిత్యసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎరుకుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని కథలుగా మలచి వెలుగులోకి తీసుకొచ్చిన ఘనత పలమనేరు బాలాజీకి దక్కిందన్నారు. మానవ సంబంధాలను పరిపుష్టం చేసే కథలతో సమాజానికి మేలు చేసే కవులు, రచయిత ల అవసరముందన్నారు. అనంతరం పలమనేరు బాలాజీ రచించిన 'ఏకలవ్య కాలనీ', 'లోపలేదో కదులున్నట్టుంది' కవితా సంపుటి పరిచయ కార్య్ర కమం సాగింది. జిల్లాకు చెందిన సాహితీవేత్త వేణు గురించి మధురాంతకం నరేంద్ర స్మారకోపన్యాసం చేశారు. అనంతరం కవుల ఇష్టాగోష్టి నిర్వహించా రు. కార్యక్రమంలో పల్లిపట్టు నాగరాజు, మంచిక టి, కృష్ణమూర్తి, స్వామిరాజు, కవితాశ్రీ, భారతి, తులసీనాథం నాయుడు, యుగంధర్, గోవిందు, గండికోట వారిజ, హసీనాబేగం, నవ్యాంధ్ర రచయి తల సంఘం అధ్యక్షురాలు కరణం విమల పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


ఎల్లప్ప దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

రొంపిచెర్ల: సమాజంలో ఉపాధ్యాయ వృతి పవిత్రమైందని డీవైఈఓ ఇందిర అన్నారు. ఆదివారం స్థానిక తెలుగు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎల్లప్ప ఉద్యోగ విరమణ సన్మానం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీవైఈఓ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, మెరుగైన సమాజం సృష్టి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. నిబద్ధతతో విద్యాబోధన చేస్తే ఎందరో విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేవారిగా తీర్చిదిద్దగలగవచ్చన్నారు. ఎల్లప్ప సేవలను ప్రస్తుతించారు. అనంతరం ఆయనను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


యాసీన్ షరీఫ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బసవరాజపురం ఉర్దూ స్కూల్ టీచర్‌కు..

పలమనేరు: గంగవరం మండలం బసవరాజపురం ఉర్దూ స్కూల్‌లో పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన యాసీన్ షరీఫ్‌కు వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా గంగవరం ఎంఈవో వేణుగోపాల్ మాట్లాడారు. యాసీన్ షరీఫ్ సేవలను ప్రస్తుతించారు. సమాజంలో పిల్లలను మంచి పౌరులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో ఉందని, ఆ పాత్రకు షరీఫ్ తనవంతు న్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు గంటామోహన్, పలువురు టీచర్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

అర్ధనగ్నంగా నిరసన

పుంగనూరు (చౌడేపల్లె): మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్మికుల సంఘ అధ్యక్షుడు శ్రీరాములు డిమాండు చేశారు. పుంగనూరులో మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం 16వ రోజు చేరాయి. మోకాళ్లపై అర్ధనగ్నంగా నిలబడి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. తమకు కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలనూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీకాంత్, వెంకటేశు, వినోద్‌కుమార్, రాజు, సుబ్రమణ్యం, సతీష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


పుంగనూరులో అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

దుర్గా మాతా నమోస్తుతే..!

పూజలు చేస్తున్న అర్చకులు


హోమం చేస్తున్న వేద పండితులు


స్థానిక దుర్గానగర్‌లోని దుర్గామాత ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో వేదపండితుల వివిధ హోమాల అనంతరం దుర్గామాతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త దామోదరం రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏటా వార్షికోత్సవం భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. - వి.కోట


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు